విశాలాంధ్ర కృష్ణా జిల్లా

అల్లర్లు గొడవలు చేస్తే చర్యలు : సీఐ

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్‌లకు ఆదివారం 1టౌన్ సిఐ ఇంద్ర శ్రీనివాస్ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అల్లర్లు గొడవలు అసాంఘిక కార్యక్రమాలు చేసిన సహించేది లేదన్నారు. రౌడీ షీటర్‌లు మంచి ప్రవర్తనతో ఉంటూ మీ భార్య బిడ్డలకు దగ్గరగా ఉండి సమాజంలో మంచి చేయాలన్నారు.

విద్యాశాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర-గుడివాడ : విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ (ఎస్టీయూ) ప్రాంతీయ కార్యాలయాలో విద్యాశాఖ సమగ్రశిక్ష గుడివాడ మండల వనరుల కేంద్రం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 16 న్యాయమైన డిమాండ్ల పరిష్కారించాలని కోరుతూ చేస్తున్న పెన్‌డౌన్‌కు సీపీఐ, ఎస్టీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్బంగా తాతయ్యతో కలసి ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎం.వి.ఎస్. ఎన్ ప్రసాద్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి కె.వి సత్యనారాయణలు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి మినిమం టైం స్కేలు అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం సమగ్రశిక్షలో పనిచేస్తున్న వారికి కూడా మినిమం టైమ్ స్కేలు అమలు చేయాలన్నారు. ప్రతినెలా 1వ తేదిన జీతాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం నాలుగు నెలలకు ఒకసారి జీతాలు చెల్లిస్తే ఎలా బతుకుతారన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని గొప్పగా చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, సామాజిక భద్రతా పథకాలు ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గుడివాడ ఏరియా నాయకులు గూడపాటి ప్రకాష్‌బాబు, డి.రామకృష్ణ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పివిఎస్ మణికంఠ, బి.బాలరమణకుమారి, ఎన్.వెంకటేష్, వి.గోపికృష్ణ, బాపూజీరావు, సి.హెచ్ ఇసాక్, ఎం.లక్ష్మీ ప్రసన్న, పి.వి నాగలక్ష్మి, ఎస్ నీరజ, ఆర్,రాజేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐదు లక్షల మంది మెకానికుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మెకానికుల సంక్షేమ సంఘం నాయకుడు, కృష్ణాజిల్లా మెకానిక్ల సంక్షేమసంఘ కార్యదర్శి కొల్లా వెంకట సుబ్బారావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మచిలీపట్నం మెకానిక్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆరవ వార్షికోత్సవం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీతో మెకానికులకు వృత్తి తగ్గిపోతుందని, ప్రభుత్వ పరంగా రుణాలు, అర్హులైన వృద్ధ మెకానిక్ లు వ పెన్షన్లు, మెకానికుల కోసం ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆయన అన్నారు. సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు. సంఘ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ మెకానికులు జీవితాలు చాలా పేదరికంలో ఉన్నాయని ప్రభుత్వపరంగా చేయూత అందించాలని అన్నారు. ప్రతి మెకానిక్ కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వర్క్ షాపుల్లో 15 సంవత్సరాలలోపు పిల్లలను పనికి పెట్టుకోకూడదని అన్నారు. ఈ సమావేశంలో కాకినాడ పవర్ ఆయిల్ లూబ్రికెట్స్ ప్రతినిధులు అజయ్ కుమార్ వీరేష్ కుమార్ రవీంద్రనాథ్ వర్ధన్ కుమార్ సంఘ కార్యదర్శి దాసరి నాగేంద్రరావు హాజరయ్యి మెకానిక్ లందరికీ ఉచితంగా ఆయిల్ పంపిణీ చేశారు. అనంతరం మెకానికల్ ఆధ్వర్యంలో కొల్ల వెంకట సుబ్బారావును గజమాలతో ఘనంగా సన్మానించారు.

నానిని ఓడించి గుడివాడకు పూర్వ వైభవంతెస్తా ...

- టీడీపీని గెలిపించి భువనమ్మకు గిఫ్టుగా ఇస్తా
- రావితో కలసి టిడిపి అధిష్టానం ఆలోచనకు న్యాయం చేస్తా
- గుడివాడ ప్రజలకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ముందుకు : వెనిగండ్ల

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ రాజకీయం అంటే రాష్ట్ర వ్యాప్తంగానే చర్చ జరుగుతుంది. గుడివాడలో 4సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పనిచేసిన కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ని ఎదుర్కొనే దమ్మున్న నాయకుడు ఉండడనే చర్చ కొనసాగుతుంది. గతంలో టిడిపి ఇన్‌చార్జిగా పనిచేసిన రావి వెంకటేశ్వరరావుకి వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి సముచిత న్యాయం కల్పిస్తామని హామి ఇవ్వడంతో రావి 2024 ఎన్నికల్లో పోటి నుండి నిష్క్రమించారు. టిడిపి అధిష్టానం కొడాలి నానిని ఓడించేందుకు గుడివాడకు చెందిన ఎన్ఆర్ఐ అమెరికలో సుమారు 5వేల మందికి ఉపాధి కల్పించిన వెనిగండ్ల రాముకు గుడివాడ టిడిపి ఇన్‌చార్జిగా నియమించింది. టిక్కెట్‌ను కూడా కేటాయించడంతో ఈసారి గుడివాడను సీటు టిడిపి కైవసం చేసుకుని పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ఎన్ఆర్ఐ వెనిగండ్ల రామును దించింది. ఇప్పటికే రాము అనేక సేవా కార్యక్రమలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి క్రైస్తవ దేవాలయల పరిధిలోని ప్రతి కుటుంబ సభ్యులకు దుస్తులు పంపిణి చేయాడం, చనిపోయిన కుటుంబలకు ఆర్థిక సాయం, వాటర్ ప్లాంట్స్, రైతులకు ఉపయోగపడేలా ప్రోక్లైన్‌లతో కాల్వలు బాగుచేయడం, యువత కోసం పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాల కోసం పెద్దకంపెనీలతో ఇంటర్వ్యూలు నిర్వహించి కొంతమందికి ఉపాధిని కల్పించినా వెనిగండ్ల రాముకి ప్రజలు నిరాజనలు పలుకుతున్నారు. టిడిపిలో ఉన్న విభేదాలను సైతం చక్కదింది, గుడ్లవల్లేరు, గుడివాడ రూరల్, గుడివాడ టౌన్, నందివాడ మండలల నాయకులతో సమీక్షా, సమావేశలో నిర్వహించి, జిల్లా నాయకులతో కలసి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశలు నిర్వహించి అసమ్మతి వర్గం లేకుండా చేయడంలో రాము విజయానికి పునాదులు వేశారని, గుడివాడ నియోజవర్గ ప్రజలలో ఈసారి టిడిపి జెండా ఎగరం ఖాయంగా ఉందని చర్చ జరుగుతోంది.

వెనిగండ్ల రాము మాట్లాడుతూ తన తండ్రి మాజీ సైనికుడు పేరు వెనిగండ్ల వెంకటేశ్వరరావు, బాబాయి ట్రాక్టర్ మెకానిక్ అర్జునరావు, రావి శోభనాద్రీచౌదరితో సనిహితంగా ఉండే కుటుంబం మాది, నేను గుడవాడలోనే పుట్టి పేరిగి ఇంజినీరింగ్ పూర్తిచేశాను. తాను మధ్యతరగతి వ్యక్తిని. 1999లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేసేందుకు అమెరికా వెళ్లాను. యుఎస్‌లో ఐటి కన్సల్టింగ్ సంస్థను స్థాపించి విజయవంత మైన పారిశ్రామికవేత్తగా ఎదిగాను. తాను సుకదను ప్రేమించి వివాహం చేసుకున్నాను. మాకు ఇద్దరు అమ్మాయిలు, నేను చాలా నిరాడంబరమైన నేపథ్యం నుండి వచ్చాను. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న వారికి సాయం చేయడానికి ప్రయత్నించాను. అమెరికాలో 5 వేల మందికి పైగా యువతకు ఉద్యోగాలు కల్పించాను. నా వృత్తిలో బిజీగా ఉంటూ గుడివాడ ప్రజలతో ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నాను. కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో తన ఫౌండేషన్ ద్వారా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తూ ఇప్పుడు క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నారు. కృష్ణాజిల్లా అంటేనే టిడిపికి కంచుకోటగా ఉండేది. పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి రామారావు 1983, 1985లో రెండుసార్లు గుడివాడ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 2004-09లో టిడిపి ఎమ్మెల్యేగా గెలుపొందిన కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) 2012లో వైఎస్సార్‌సీపీలోకి మారిన తర్వాత ఇక్కడ పరిస్థితులు మారిపోయాయి. అప్పటి నుండి గుడివాడలో కోల్పోయిన ప్రాబల్యాన్ని టిడిపి తిరిగి దక్కించుకోవాలని రెండుసారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీన్ని ప్రెస్టీజ్‌గా తీసుకుని 2024లో నానిని పోటీకి దింపేందుకు టిడిపి అధిష్టానం నన్ను రంగంలోకి దించాలని నిర్ణయించింది. రానున్న ఐదేళ్లలో నియోజకవర్గంలోని ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలసి అయన చూచనలతో, వచ్చే ఎన్నికల్లో గుడివాడలో టిడిపిని గెలిపించి నారా భువనేశ్వరమ్మకు గిఫ్టుగా ఇస్తానన్నారు.

సీతారామయ్య స్మారక భవనాన్ని నిర్మిస్తాం

విశాలాంధ్ర-మచిలీపట్నం : టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వాతంత్ర సమరయోధుడు, ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు, భోగరాజుపట్టాభి సీతారామయ్య పేరిట స్మారక భవనాన్ని నిర్మించి తీరుతామని పలువురు నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సెంటర్లో ఉన్న భోగరాజు పట్టాభి సీతారామయ్య 64వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ బిల్డింగ్ సాధన కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పట్టాభి సీతారామయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మచిలీపట్నంలో పట్టాభి స్మారక భవనం కోసం పాలకుల తీరును విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాట్లాడుతూ మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని మచిలీపట్నంనకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిన స్వాతంత్ర సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్యను విస్మరించడం సిగ్గుచేటని విమర్శించారు. మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ సాక్షాత్తు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వాతంత్ర్యసమరయోధుడు పట్టాభి సీతారామయ్య పేరిట స్మారక భవనం కోసం స్థలం కేటాయించిన మచిలీపట్నం ఎమ్మెల్యే, పేర్ని నాని, మచిలీపట్నం నగరపాలక సంస్థ అధికారపార్టీ పాలకవర్గ సభ్యులు మచిలీపట్నం నగరపాలక సంస్థలో రెండు సంవత్సరాల నుండి అనుమతులు ఇవ్వకపోవడం ప్రజలు గమనిస్తున్నారని, వైసీపీ కార్యాలయాన్ని ఆగమేఘాలమీద నిర్మిస్తున్న పాలకులు, స్వాతంత్ర సమరయోధుడు పేరుట నిర్మించే స్మారక భవనాన్ని విస్మరించడం సిగ్గుచేటు అన్నారు.

సీపీఐ మచిలీపట్నం నియోజకవర్గ కార్యదర్శి, లింగం ఫిలిప్ మాట్లాడుతూ. కృష్ణాజిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీ బాలశౌరి మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్‌ను, కలెక్టర్ ఎదుట నిలదీసినా కూడా స్పందన లేదంటే ఇంకా అధికారులు ప్రజలకు ఏమి విలువ ఇస్తారో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రతిపక్ష కార్పొరేటర్లు, పట్టాభి స్మారక భవన సాధన కమిటీ సభ్యులు మేయర్‌ని కలిసి వినతిపత్రం ఇచ్చినా కనీసం మేయర్ పట్టాభి స్మారక భవనం విషయంపై ప్రజలకు వివరిస్తూ మీడియా ముందు కూడా స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, బండి రామకృష్ణ,గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, లంకి శెట్టి నీరజ, ఎన్ వసంత కుమారి, లతీ ఫున్నీసా, బచ్చుల బోసు బాబు,బత్తిన అగస్త్రీశ్వర రావు, జనసేన నాయకులు, గడ్డం రాజు, కొట్టే వెంకట్రావు, వంపు గడల చౌదరి, పినిశెట్టి వేణు, పట్టాభి స్మారక భవనం సాధన కమిటీ సభ్యులు, ప్రముఖ న్యాయవాది, సోడిశెట్టి బాలాజీ రావు,వేమూరి రామకృష్ణారావు, ఏ ఆర్ కె మూర్తి, మోపర్తి సుబ్రహ్మణ్యం, పి. వి. ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ముదినేపల్లి : ఇటీవల ఆత్మహత్యలకు పాల్పడిన వారి కుటుంబాలను టిడిపి నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ముదినేపల్లి మండలం విశ్వనాద్రిపాలెంకు చెందిన పరసా మాతనాగబాబు, అనూష కుటుంబ సభ్యులను కైకలూరు నియోజకవర్గం టిడిపి నాయకులు బికేఎం చారిటబుల్ ట్రస్ట్ నుండి బికేఎం నాని , జడ్పిటీసి మాజీ సభ్యురాలు విజయలక్ష్మి పరామర్శించి 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలం ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్ , నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దావు నాగరాజు , పరసా ఏడుకొండలు , నున్న సుబ్రహ్మణ్యం , నాగేశ్వరరావు , రాంబాబు , దాసరి శ్రీను , వెంకన్న , నాంచారయ్య , చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్ర వైసీపీ పతనానికి నాంది : బొడ్డు

విశాలాంధ్ర-పెడన : యువగళం పాదయాత్ర ముగింపు అవినీతి వైసిపి ప్రభుత్వ పతనానికి, నవశకానికి నాంది కాబోతుందని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం పెడన పట్టణంలోని 5వ వార్డులో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటా తిరుగుతూ బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీల ఉమ్మడి మేనిఫెస్టో పేద ప్రజల సంక్షేమానికి మరియు ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.ఈనెల 20న నెల్లిమర్ల మండలంలో జరగబోవు యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాలలో నూతన వరవడికి శ్రీకారం కాబోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రహమాన్ బేగ్, (పూలబాబు)పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్ తెలుగుదేశం పార్టీ నాయకులు అబ్దుల్ గఫార్ తదితర నాయకులు పాల్గొన్నారు

చెవిలో పూలతో అంగన్‌వాడీల నిరసన

విశాలాంధ్ర-కూచిపూడి : తమ కోర్కెల సాధనకై అంగన్వాడీ సిబ్బంది ఐదు రోజులుగా ఉధృతంగా నిరవధిక సమ్మె చేస్తుండగా ఆరవ రోజైన ఆదివారం సెలవు దినమైనా పట్టు వదలని విక్రమార్కుని వలె దీక్షకు తరలివచ్చి మొవ్వ ఐసిడిఎస్ కార్యాలయ ప్రాంగణంలో వినూతనంగా చెవిలో పూలతో నిరసన దీక్ష చేశారు. మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లోని 185 కేంద్రాల నుంచి నుంచి సిబ్బంది అధిక సంఖ్యలోతరలివచ్చి ఈ దీక్షలో పాల్గొన్నారు. వీరితోపాటు సిపిఎం, దాని అనుబంధ సంస్థైన సిఐటియు నేతలు కూడా నిరసన దీక్షలో పాల్గొన్నారు.

పింఛన్ ఉద్యోగికి ప్రాథమిక హక్కు: వెంకట్రావు

విశాలాంధ్ర-గన్నవరం : ప్రతి ఉద్యోగికి పెన్షన్ ప్రాథమిక హక్కు అని విశ్రాంతి అధ్యాపకులు గన్నే వెంకట్రావు అన్నారు. ఆదివారం పెన్షనర్ డే సందర్భంగా బుద్ధవారం రోడ్డులో ఏ పి రిటర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గన్నవారం సబ్ ట్రెజరీ యూనిట్ సర్వసభ సమావేశం అధ్యక్షులు అవుటపల్లి మోహనరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఉద్యోగి పెన్షన్ దయ ధర్మం కాదు అన్నారు. ఉద్యోగి పెన్షన్ తీసివేసే హక్కు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని అన్నారు. ఉద్యోగి తన సర్వీసు లో కాలంలో దాచుకున్న ధనం అన్నారు. ఆరుగురికి 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లకు డి ఎస్ ప్రకాశరావు, పి ప్రభాకరరావు, వడ్డీ రాజేశ్వరి,కె రామచంద్రావు,సిహెచ్ ఆదాం, దానవలి నాగేశ్వరవు సాలువలతో సన్మానించి చేతి కర్ర అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఓ కిలారి నాగరాజు ప్రభాకర్ చౌదరి,.జి కొటేశ్వరవు, సూరగని వెంకటేశ్వరరావు, కార్యదర్శి వల్లి పెన్షనర్ల పాల్గొన్నారు.

రైతు పరిస్థితి ముందు నుయ్యి... వెనుక గొయ్యి!



విశాలాంధ్ర-పమిడిముక్కల: రైతులకు అన్నివిధాల నష్టం అపారంగా ఉందని ప్రస్తుత పరిస్థితుల్లో ముందు నుయ్యి వెనుక గొయ్యి లాగా ఉందని వాపోతున్నారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటను కోత కి ఎకరానికి ఎనిమిది వేలు కట్టెతకి పదివేల రూపాయలు అడుగుతున్నారని ఇక మినప విత్తనాలు బస్తా పదునాలుగు వేలతో కొని అది చేతికి వచ్చే సమయంలో ఎం ముంచుకు వస్తుందోనని ఆందోళన గా ఉందని ఐనంపూడి కి చెందిన రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ తో కోయించట వలన పశువులకు పశుగ్రాసం వుండదని దానిని కొనాలంటే ధర చుక్కల్లో ఉంటుందని అంటున్నారు. వాతవరణం రోజుకోక రకంగా ఉంటోందని దానితో మిషన్ కోతకే ప్రాధాన్యం ఇస్తున్నామని, చేలు మరల దమ్ము కి పదమూడు వందల వసూలు చేస్తున్నారని దాని పై అపరాలు చల్లుతున్నామని ,కౌలు రైతుల భాదల వర్ణనా తీతమని ప్రభుత్వం ఏటా మినుము, పెసర,జీలగ విత్తనాలు సబ్సిడీ పై వ్యవసాయ శాఖ, సహకార బ్యాంకుల ద్వారా రైతులకు పంపిణీ చేశావారని ప్రస్తుతం అవిఏమి లేకుండా చేశారని తెలిపారు.

ఆర్టీసీ బస్సు బోల్తా..

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి నడకుదురు ప్రధాన రహదారిపై కరకట్ట మీదుగా విజయవాడ వెళ్లాల్సిన అవనిగడ్డ ఆర్టీసీ డిపో బస్సు (కరకట్ట ఎక్స్‌ప్రెస్ ఏపీ 16జడ్ 0144) చల్లపల్లి మండలం మేకావారిపాలెం వద్ద అదుపుతప్పి మురుగు బోదెలోకి దూసుకువెళ్లి పల్టీ కొట్టింది. అదృష్టవశాత్తూ బస్సులో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. నలుగురైదుగురికి మాత్రం గాయాలు కాగా, మిగిలిన వారందరూ అతిస్వల్ప గాయాలతో క్షేమంగా నిలిచారు. బస్సులో 44 మంది పెద్దలు ఉండగా, చిన్న పిల్లలు సైతం ఉన్నారు. అవనిగడ్డ నుంచీ బయలుదేరిన కరకట్ట ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం సుమారు పది గంటలు దాటిన తర్వాత చల్లపల్లి బస్టాండ్ నుంచి వెళ్లింది. నడకుదురు రోడ్డులో వెళ్తున్న బస్సు లంకతోట అడ్డరోడ్డు దాటిన తర్వాత రహదారి ఎత్తు పల్లాలుగా ప్రమాకరంగా ఉండటంతో ఆ ప్రదేశంలో అదుపుతప్పింది. డ్రైవర్ బ్రేకు వేసి అదుపుచేస్తూ ఎడమవైపుకు తిప్పే ప్రయత్నం చేసినప్పటికీ కంట్రోల్ అవక కుడివైపుకు దూసుకువెళ్లి మురుగుబోదెలోకి పల్టీకొట్టింది. సమీప పొలాల్లో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలు, స్థానిక యువత పరుగులుపెట్టి ఘటనా ప్రదేశానికి చేరుకుని ప్రయాణికులను బయటకు తీశారు. సీఐ సిహెచ్.నాగప్రసాద్, ఎస్ఐ సిహెచ్.చిన్నబాబులు హుటాహుటిన సంఘటనా ప్రదేశానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. టీడీపీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, గుత్తికొండ వంశీకృష్ణ, రాజులపాటి సురేష్, రైతులు ప్రయాణికులకు సహాయపడ్డారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్బాబు, ఆర్టీసీ డీఎం కె. హనుమంతరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్, టీడీపీ నేతలు సంఘటనా ప్రదేశాన్ని సందర్శించి, ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. బస్సు కండీషన్లో ఉందనీ, గోతుల కారణంగా అదుపుతప్పినట్లు డ్రైవర్ చెప్పారని డీఎం తెలిపారు.

కలెక్టర్ చొరవతో కార్మికులకు మోక్షం

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ప్రత్యేక చొరవతో బస్సు సౌకర్యం ఏర్పాటై రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి ఇండస్ట్రియల్ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక ఎగుమతుల కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన స్పందిస్తూ హనుమాన్ జంక్షన్ నుండి మల్లావల్లి మాడల్ ఇండస్ట్రియల్ ఎస్టేట్లోకి వెళ్లేందుకు కార్మికులు చాలా ఇబ్బందులు పడేవారు. బస్సులు లేక నానా అవస్థలు పడి ఆటోలో వెళ్లాల్సి వచ్చేది. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఆ ప్రాంతంలో ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత ఆర్టీసీ అధికారులకు సూచించారు. దీంతో గత శనివారం నుండి హనుమాన్ జంక్షన్ నుండి మల్లావల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్ కు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేశారు. ఆ బస్సు ఉదయం రెండు ట్రిప్పులు సాయంత్రం రెండు ట్రిప్పులు నడుస్తోంది. అవసరాన్ని బట్టి ట్రిప్పులను, బస్సులను పెంచేందుకు ఆర్టీసీ సిద్ధంగా ఉంది. తమ విజ్ఞప్తి వేరకు బస్సు ఏర్పాటు చేసి తమ ఇబ్బందులను తొలగించినందుకు ఆ కార్మికులు జిల్లా కలెక్టర్ కు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కు ధన్యవాదాలు తెలిపారు.

మత్స్యశాఖను ప్రక్షాళన చేయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : మత్స్యశాఖను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మత్స్యశాఖ పనితీరు నిరువేదం కల్గిస్తుందని, తక్షణమే మత్స్యశాఖను ప్రక్షాలన చేయాలని ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదివారం డిమాండ్ చేశారు. ఆయన స్థానిక విలేకరులతో మత్స్య భవనం వద్ద మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందచేస్తున్న అరకొర నిధులను సైతం ప్రణాళికా బద్దంగా వినియోగించకపోవడం వలన లక్షలాది మంది మత్స్యకారుల ప్రయోజనాలకు విఘాతం కల్గుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రంఘ సంస్థల నుండి నిధులను రాబట్టి మత్స్యకారుల సంక్షేమానికి హెచ్చించడంలో కమిషనర్ విఫలం అయ్యారన్నారు. కమిషనరేట్‌లోని కమిషనర్ స్థాయి అధికారి నుండి అటెండర్ స్థాయి ఉద్యోగం వరకు ప్రతి ఒక్కరిని బదిలీ చేయాలని గత నాలుగున్నర సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి మత్స్యశాఖ కు వచ్చిన నిధులు మత్స్యకారుల సంక్షేమానికి ఖర్చు చేసిన నిధుల వివరాలపై శ్వేతపత్రాన్ని మత్స్యశాఖ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మత్స్యకార సంఘ నాయకులు కర్రి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బస్సు ప్రమాదం దురదృష్టకరం : ఎమ్మెల్యే సింహాద్రి

విశాలాంధ్ర-చల్లపల్లి : ఆర్టీసీ బస్సు ప్రమాద ఘటన దురదృష్టకరమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్బాబు అన్నారు. మేకావారిపాలెం వద్ద బస్సు ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తొలుత చల్లపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. గాయాలపాలైన వారికి ప్రాథమికచికిత్సలు అందించి మెరుగైన చికిత్సల నిమిత్తం బందరు తరలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంఘటనా స్థలానికి చేరుకుని బస్సును పరిశీలించి డీఎంతో మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట వైసీపీ కన్వీనర్ శీరం నాని, సర్పంచ్లు, ఎంపీటీసీలు, నేతలు ఉన్నారు.

23న భరతముని జయంతి

విశాలాంధ్ర-కూచిపూడి : అఖిలభారత కూచిపూడి నాట్యకళా మండలి ఆధ్వర్యంలో ఈనెల 23న నాట్య క్షేత్రమైన కూచిపూడి శ్రీ గంగా బాలా త్రిపురసుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయ సమీపంలోని శ్రీ సిద్ధేంద్రయోగికళా వేదికపై ప్రతి సంవత్సరం నిర్వహించినట్లుగా ఈ ఏడాది కూడా భరతముని జయంతోత్సవము నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి పసుమర్తి మృత్యుంజయ ఆదివారం విలేకరులకు తెలిపారు. కళా మండలి వ్యవస్థాపక కార్యదర్శి పసుమర్తి కేశవ ప్రసాద్ గతంలో కొనసాగించిన సాంప్రదాయాన్ని తాను కూడా అనుసరిస్తున్నట్లు ఆయన కుమారుడైన మృత్యుంజయ తెలిపారు.

గొబ్బెమ్మల సందడి

విశాలాంధ్ర-కూచిపూడి : నెల రోజులు పాటు కొనసాగే ధనుర్మాస వేడుకలు, ముగ్గుల పండగ వేడుకలు, గొబ్బెమ్మల సందడి ఆదివారం నుంచి ప్రారంభమైనాయి. అలాగే సంక్రాంతి నెల కూడా నేటినుంచి ప్రారంభమైంది. ఈ నెల రోజులు ఆడపిల్లలు వయసుతో తారతమ్యం లేకుండా తెల్లారేసరికిఇంటి ముందర లోగిళ్ళలో రకరకాల ముగ్గులు వేసి వాటిల్లో గొబ్బెమ్మలను పెట్టుకొంటూ హుషారుగా గడుపుతారు. అలాగే విష్ణాలయాలలో ధనుర్మాస వేడుకలు తిరుప్పావై పాశురాలు పఠనం నిర్వహిస్తారు. పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమంలో మముముక్షుజన పీఠాధిపతి ముక్తేవి గౌరకృష్ణ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ప్రారంభమైనాయి. అలాగే ఈ వేడుకలు మొవ్వ మండలంలో కూచిపూడి, పెదపూడి, భట్లపెనుమర్రు, పెదసనగల్లు, బార్లపూడి, మొవ్వ, వేములమడ, కోసూరు, కాజ, నిడుమోలు, చినముత్తేవి, మంత్రిపాలెం, పెదముత్తేవి, కొండవరం, మూలపాలెం,గూడపాడు గ్రామాలలో గలవిష్ణాలయాలు, రామాలయాలలో పుష్య మాసంలోని సంక్రాంతి పండగ వరకు నిర్వహిస్తారు.

ఎమ్మెల్సీ సాబ్జీ మృతి తీరని లోటు : డిటిఎఫ్

విశాలాంధ్ర-పెదపారుపూడి : ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కా" షేక్ సాబ్జీ అకాల మరణం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటు అని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కే నరహరి, ప్రధాన కార్యదర్శి ఎన్వి రమణయ్యలు తెలిపినట్లు డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వరుణ కుమార్ ఆదివారం అన్నారు. ఈ సందర్భంగా రావెళ్ల మాట్లాడుతూ సాబ్జీ ఉపాధ్యాయ వృత్తి నుంచి వివిధ స్థాయిలో ఉపాధ్యాయ ఉద్యమ నేతగా, యు టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎదిగారని అన్నారు. ఉద్యమాలే కాకుండా అనేక కార్మిక, ప్రజాస్వామిక, ప్రజా సంఘ, సామాజిక ఉద్యమాలలో భాగస్వాములయ్యారని అన్నారు. కా" షేక్ సాబ్జీ (ఎమ్మెల్సీ) అకాల మరణం పట్ల ఆయన కుటుంబ సభ్యులకు మరియు తన ఉద్యమ సహచరులకు డిటిఎఫ్ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుందని రావెళ్ల వివరించారు.

బ్రిటిషు పాలనను తలపిస్తున్న ప్రభుత్వ నిర్ణయాలు

విశాలాంధ్ర-బంటుమిల్లి :- కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలు బ్రిటిషు పరిపాలనను తలపిస్తుందని ,ప్రశ్నించిన వారిపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వాలను వజ్రాయుధం లాంటి ఓటుతో సాగనంపాలని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొల్లాటి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బంటుమిల్లి ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆరవ రోజు సమ్మెలో భాగంగా ధర్నా కార్యక్రమం సాగింది. మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొల్లేటి శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. పెడన ,బంటుమిల్లి ,కృత్తివెన్ను మండలం అంగన్వాడిటీచర్లు ఈ దీక్ష శిబిరంలో కుర్చున్నారు.

దుస్తులు, నిత్యావసరాల పంపిణీ

విశాలాంధ్ర-చల్లపల్లి: ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ సేవలు ప్రశంసనీయమని చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్ అన్నారు. ఆదివారం సాయంత్రం చల్లపల్లిలోని రెండు మురికివాడల్లో జీవిస్తున్న 90 నిరుపేద ఎస్టీ కుటుంబాల వారికి రూ.3లక్షలు వ్యయంతో నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు అందచేశారు. ఐవీఎం ద్వారా విస్తృత సేవ చేస్తున్న డాక్టర్ వేములపల్లి సురేష్ - రోజా దంపతులు ఆదర్శనీయులు అన్నారు. దశాబ్దాలుగా సమాజ సేవ చేస్తున్న ఐవీఎం సేవలు నిరుపేద ఎస్టీలకు వరం అన్నారు. మూడు సంవత్సరాల నుండి ప్రతీ నెల నిత్యసర సరుకులు అందిస్తూ వారి కుటుంబాలకు అండగా నిలవడం సురేష్ దాతృత్వానికి నిదర్శనమన్నారు. స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'యువగళం' జయప్రదం చేయండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : భావితరాల భవిష్యత్ కోసం యువనాయకుడు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతంగా కొనసాగుతూ ఈ పాదయాత్రలో యువ నాయకుడు నారా లోకేష్ ఈ ప్రభుత్వంలో దగా పడిన ప్రతి ఒక్కరిని ఓదారుస్తూ నేను ఉండాను అంటూ భరోసానిస్తూ దిగ్విజయవంతంగా సాగుతున్న పాద యాత్ర ఈ నెల 20వ తేదీన విజయనగరం జిల్లా,నెల్లిమర్ల నియోజకవర్గం, భోగాపురం మండలం, పోలిపల్లిలో ముగింపు సభ నిర్వహించనున్నారు. ఈ సభకు రాష్ట్ర నలుమూలల ప్రజలు ,తెలుగుదేశం పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలనీ కృష్ణా జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

నిజాయితీ చాటిన తాడంకి సర్పంచ్ 'జంపాన'

విశాలాంధ్ర-పమిడిముక్కల: తాడంకి సర్పంచ్ జంపాన ధనలక్ష్మి తీర్థయాత్రలకు వెళ్ళి తిరిగి వచ్చే సమయంలో రైల్లో దొరికిన పర్సుని ఉత్తరప్రదేశ్ కి చెందిన వారిగా గుర్తించి పోలీసులు ద్వారా అందచేసిన సర్పంచ్ ధనలక్ష్మి నిజాయితీ గా ఆదర్శంగా నిలిచారని పమిడిముక్కల సి.ఐ. కిషోర్ బాబు ప్రశంసించారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్, బంధువులు ఇటీవల తీర్థయాత్రలకు వెళ్ళి తిరిగి వచ్చే సమయంలో కేరళా ఎక్స్ ప్రెస్ లో పర్సు దొరక గా ఆ భోగి లో విచారించనా ఎవ్వరూ స్పందించక పోవటంతో ఇంటికి వచ్చి ఆమె పర్సు పరిశీలించగా రూ.12,300 నగదు సెల్ ఫోన్ , ఆధార్ కార్డు,ఇంటి తాళాలు,ఇతర పత్రాలను ఉండుటచే మానవతా దృక్పథంతో పమిడిముక్కల సి.ఐ.ద్వారా ఉత్తర ప్రదేశ్ కి చెందిన వారివిగా గుర్తించి సదరు నగదుని ఎకౌంటుకు బదిలీ చేసి వస్తువులు లను కొరియర్ ద్వారా పంపించి సర్పంచ్ ధనలక్ష్మి ని అభినందించారు. ఈ కార్యక్రమంలో తాడంకి కార్యదర్శి బందారు సునీత యువనాయకులు జంపాన రవి కుమార్ కె.రాంబాబు పాల్గొన్నారు.

సహకార బ్యాంకు సేవల పై కళాజాత

విశాలాంధ్ర-పమిడిముక్కల : సహకార బ్యాంకు సేవల ప్రజలకు తెలియ జేయుటకు ప్రతి గ్రామంలో కళాజాత తో అవగాహన కల్పిస్తున్నట్లు వీరంకిలాకు సహకార బ్యాంకు మేనేజర్ ఉదయ్ కుమార్ తెలిపారు. ఆదివారం వీరంకి, లంకపల్లి గ్రామంలో కళాజాత బృందం బ్యాంకు సేవల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డ్ వారి సౌజన్యంతో జిల్లా సహకార బ్యాంకు వారి ఆధ్వర్యంలో బ్యాంకు చైర్మన్ మరియు సి.ఇ.ఓ.ఆదేశాల మేరకు డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత లో అవగాహన, గ్రామాల్లో ప్రతి ఒక్కరూ బ్యాంకు ఎకౌంటు ప్రారంభం చెయ్యాలని ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా, ప్రధాన మంత్రి సురక్ష భీమా,అటల్ పెన్షన్ యోజన కిసాన్ క్రెడిట్ కార్డు నగదు రహిత లావాదేవీలు తదితర అంశాలపై కీర్తనా కల్చరల్ సొసైటీ బృందం చే కళాజాత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సీతారామ శర్మ టి.శేషువర్ధన్ సొసైటీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-గన్నవరం : అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు వెంటనే పరిష్కరించాలని సిఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్ళం వెంకటేశ్వరవు డిమాండ్ చేశారు. సీడీపీఓ కార్యాలయం ఎదుట 5 రోజులుగా సమ్మె చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంగన్వాడీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తాతాబాయ్, అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

'అయోధ్య' పేరుతో రాజకీయం

నగర కౌన్సిల్‌లో బీజేపీపై దోనేపూడి ఆగ్రహం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కేంద్రంలో మోదీ ప్రభుత్వం అయోధ్య రామాలయం పేరుతో రాజకీయం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. ఆదివారం సీపీఐ నగర పార్టీ కౌన్సిలింగ్ సమావేశం పార్టీ నగర సమితి సభ్యులు కంచర్ల నాగేశ్వరరావు అధ్యక్షతన విజయవాడ కొత్తపేటలోని లెనిన్‌భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు హాజరైయ్యారు. ఈ సందర్భంగా దోనేపూడి శంకర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అయోధ్య రామాలయం అక్షింతలు గ్రామ గ్రామానికి తీసుకునివెళ్లి బీజేపీ మరోసారి రాజకీయాలకు తెరలేపింద న్నారు. దీనికి ఆర్‌ఎస్‌ఎస్, సంఘపరివార్ శక్తులు పనిచేస్తున్నాయన్నారు. సెక్యులర్ భావాన్ని కట్టుబడి ఉండాల్సిన దేశ ప్రధాని మంత్రి నరేంద్రమోదీ కర్ణాటకలో జైభజ రంగభళి నినాదాలు చేయడం సిగ్గుచేటన్నారు. అయోధ్య రామాలయం అక్షింతలు అడ్డుపెట్టుకోని మళ్లీ కేంద్రంలో రావడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాముడిని పేరుతో ప్రజలమధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో తుపాన్‌తో కరువు, అతివృష్టితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి టూరిస్ట్ మంత్రిగా పనికోస్తారాన్నారు. తుపాన్‌తో తడిసిన ధాన్యాన్ని చూడటానికి వచ్చిన ముఖ్యమంత్రికి అధికారులు ఒలపింక్ గేమ్స్ మారిదిలా స్టేజీ ఏర్పాటు చేయడం హాస్యస్పదం అన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా చేతితో పట్టుకున్న పాపాన పోలేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలపై ప్రజలు తీవ్ర వ్యతిరేకత చూపుతున్నారని, ఇప్పటికైనా ప్రజలు గుర్తించాలని దోనేపూడి పేర్కొన్నారు. విజయవాడ నగరానికి కమ్యూనిస్టు పార్టీ సేవలు గుర్తించి, ప్రశ్నించే గొంతులను సీపీఐని అసెంబ్లీ, మున్సిపల్ కార్పొరేషన్‌లకు పంపి ప్రజలు మార్పు తేవాలన్నారు.

అలాగే నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశంలో సీపీఐ 99 ఏళ్లు అనేక పోరాటాలు చేసిందన్నారు. భూమి కోసం, పేద ప్రజసమస్యలపై అనేక ఉద్యమాలు చేపట్టిందన్నారు. ప్రజలకు లక్షలాది ఎకరాల భూమిని పంపిణీ చేసిన చరిత్ర భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీదే అన్నారు. అదే సందర్భంలో విజయవాడలో నగరపాలకసంస్థలో రెండుసార్లు ప్రాతినిధ్యం వహించి నగర అభివృద్ధికి కమ్యూనిస్టు పార్టీ పాటుపడిందన్నారు. పేదలు నివాసించే కొండ ప్రాంతం కమ్యూనిస్టు హాయంలో అభివృద్ధి చేశామన్నారు. ఆనాడు తమ్మిన పోతురాజు, నాసర్‌వలీ సమయంలో నియోజకవర్గానికి అభివృద్ధి బాటలో తీసుకెళ్లామన్నారు. సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించాలని జాతీయ పార్టీ పిలుపునిచ్చిందన్నారు. ఈనెల 26వతేదీన విజయవాడలో 99వ వ్యవస్థాపక దినోత్సవానికి వేలాదిమంది తరలిరవాలన్నారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, కార్యవర్గసభ్యులు తాడి పైడయ్య, మూలి సాంబశివరావు, పంచదార్ల దుర్గాంబ, నజీర్, వీర్రాజు, ప్రజానాట్యమండలి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రేషన్ సరఫరా : జేసీ

విశాలాంధ్ర-విజయవాడ : రేషన్ కార్డుదారుల సౌకర్యార్థం ఈనెల 18వ తేది మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు ఎండీయూ వాహనాన్ని సంబంధిత వార్డు, గ్రామ సచివాలయం వద్ద ఉంచి కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. పి సంపత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని కార్డుదారులు వినియోగించుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఎండీయూ ఆపరేటర్లు, వాలంటీర్లు వారికి కేటాయించిన రైస్ కార్డుదారులందరికీ రేషన్ అందేలా తహసిల్దార్లు, సహాయ పౌరసరఫరాల అధికారులు, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసిల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని జేసీ తెలిపారు.

స్నాచింగ్‌లు... చోరీలు..!

- పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం దొంగతనాలు.. స్నాచింగ్‌లు
- బైక్ చోరీలూ ఎక్కువే...
- గతంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్నవారి నుంచి డబ్బులు లాక్కునిపోయిన దుండగులు
- తాజాగా వృద్ధుడి నుంచి 258 గ్రాముల బంగారం లాక్కుని పరార్
- స్టేషన్ పరిధిలో కొరవడిన నిఘా.. ప్రైవేట్ పంచాయితీల్లోనే పోలీసుల బిజీ

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: బంగారం.. సెల్‌ఫోన్ స్నాచింగ్‌లు.. బైక్‌లు, ఇళ్లలో దొంగతనాలకు పటమట పోలీస్ స్టేషన్ ఏరియా కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఈ స్టేషన్ పరిధిలో నిత్యం చోరీలు, స్నాచింగ్‌లు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా పట్టపగలే ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని ఓ బ్యాంక్ వద్ద వృద్ధుడి దృష్టి మళ్లించి 258 గ్రాముల బంగారాన్ని దుండగులు లాక్కుని పారిపోవడం నగరంలో సంచలనం సృష్టించింది. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసులు నిఘా లేకపోవడమే ఈ దొంగతనాలు, స్నాచింగ్‌లకు కారణమని మండిపడుతున్నారు. పటమట పోలీసులు ప్రైవేట్ పంచాయితీలపై పెట్టే శ్రద్ధ నేరస్తుల కదలికలపై పెట్టడంలేదని ఆరోపిస్తున్నారు.

నిద్దరోతున్న నిఘా... ఇతర ప్రాంతాల నేరస్తులకు వరం

పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ప్రధాన రహదారులు ఉన్నాయి. ఇతర ప్రాంతాల నేరస్తులు ఎక్కువగా ఈ రహదారుల గుండా వచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఈ విషయం తెలిసినా పోలీసులు కనీసం నిఘా పెట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో దొంగలు యథేచ్ఛగా జాతీయ రహదారుల మీదుగా వచ్చి, ఇక్కడే ఒకటి, రెండు రోజులు సంచరిస్తూ రెక్కీ నిర్వహించుకుని పక్కాగా చోరీలు, స్నాచింగ్‌లకు పాల్పడి వెళ్లిపోతున్నారని పోలీసు వర్గాల్లోనే చర్చసాగుతోంది. ఈ నెల 10వ తేదీన నిర్మలా కాన్వెంట్ రోడ్డులోని ఓ ఇంట్లో చోరీ చేస్తూ పట్టుబడిన వ్యక్తి గురించి ఆరా తీస్తే అతనిపై ఉమ్మడి గుంటూరు జిల్లాలో కేసులు ఉన్నాయి. అదేవిధంగా శుక్రవారం ఎన్టీఆర్ సర్కిల్ సమీపాన బ్యాంక్ వద్ద వృద్ధుడి దృష్టి మళ్లించి 258 గ్రాముల బంగారం లాక్కుని పారిపోయినవారు కూడా ఇతర ప్రాంతాల నుంచి వచ్చినట్లు అనుమానిస్తున్నారు. ఈ లెక్కన పటమట పరిధిలో నిఘా ఉండదని, నేరాలు దర్జాగా చేసుకుని వెళ్లవచ్చని నేరస్తులు భావిస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఈ స్టేషన్ పరిధిలో ప్రైవేట్ పంచాయితీలకే ప్రాధాన్యత ఇస్తారని, రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులు సిఫార్సు చేసిన కేసుల విషయంలోనే వేగంగా స్పందిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. సామాన్యులు బైక్‌లు పోయాయని, దొంగతనాలు జరిగాయని ఫిర్యాదు చేసినా పెద్దగా పట్టించుకోరని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో నిఘా పెంచాల్సిన అవసరం ఉంది.

- సెప్టెంబర్ 1వ తేదీ రాత్రి నిర్మలా కాన్వెంట్ సమీపంలోని రహదారి డివైడర్‌పై నిద్రిస్తున్న ఐదుగురు వద్ద నుంచి రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు దుండగులు డబ్బులు లాక్కుని పారిపోయారు.
- అక్టోబర్ నెలలో పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు బైక్‌లు చోరీకి గురయ్యాయి. ఇలా ప్రతి నెలా 3 నుంచి 5 వరకు బైక్‌లు చోరీకి గురవుతూనే ఉన్నాయి. వీటిలో ఎక్కువ మంది పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కూడా ముందుకు రావడం లేదు.
- నవంబర్ 19న పటమటలోని ఓ ఫంక్షన్ హాలులో 30 గ్రాముల బంగారు నెక్లెస్ చోరీకి గురైంది.
- డిసెంబర్ 10వ తేదీన పటమట నిర్మలా కాన్వెంట్ రోడ్డులో ఓ ఇంట్లో యజమాని, అతని కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగానే దొంగ వచ్చి సెల్‌ఫోన్ చోరీ చేశాడు. లాప్‌టాప్‌ను తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా ఇంటి యజమానికి మెలకువ వచ్చి దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆ దొంగపై గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

తిరుపతమ్మ ఆలయ చైర్మన్‌గా వాసు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : దేవాలయాల్లో ఉన్నత పదవుల్లో పనిచేసేందుకు బలహీనవర్గాల వారు పనిచేయలేరు అనుకోవడం అవివేకమని మాజీ మంత్రి, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. చరిత్రను చెరిపివేసి బీసీ వ్యక్తిని పెనుగంచిప్రోలు దేవస్థానం చైర్మన్‌గా జంగాల శ్రీనివాసరరావు (వాసు)ని నియమించడం ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ధైర్యానికి నిదర్శనమని ఆయన తెలిపారు. పెనుగంచిప్రోలు తిరుపతమ్మ వారి దేవస్థానం ఆవరణంలో ఆదివారం ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అధ్యక్షతన జరిగిన నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవంలో అధితులుగా పాల్గొన పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొన్నారు, యువ నాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్‌గా జంగాల శ్రీనివాసరావు తో పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ చాందస్తవాదంతో హిందుత్వం మరుగునపడుతుందని అన్నారు. యాదవ సామాజికవర్గానికి చెందిన జంగాల శ్రీనివాసరరావు (వాసు) కి పదవి ఇవ్వడం ఇష్టం లేని అగ్రవర్ణాలోని కొంతమంది పునరాలోచించుకోవాలని సూచించారు. ఉదయభాను మాట్లాడుతూ పెనుగంచిప్రోలు అమ్మవారి దేవస్థానాన్ని 15 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కేశఖండనశాల, కళ్యాణ వేదిక, షెడ్డు, డార్మెటరీ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అనాదికాలంగా ఓసీలకు కేటాయిస్తున్న చైర్మన్ పదవిని ఈసారి బీసీకి ఇచ్చామని దీనికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని అన్నారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులను ఉదయభాను అభినందించారు. అమ్మవారి దేవస్థానానికి మరిన్ని కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఉదయభాను అభిలషించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు వినియోగించని పరికరాలు వేలం

విశాలాంధ్ర-విజయవాడ : పశు సంవర్ధక శాఖ, పశు వ్యాధి నిర్ధారణశాల కార్యాలయానికి చెందిన నిరుపయోగంగా ఉన్న పరికరాలను ఈ నెల 19వతేదీన బహిరంగ వేలం వేయడం జరుగుతుందని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశు వ్యాధి నిర్ధారణశాలకు చెందిన నిరుపయోగంగా ఉన్న రిఫ్రిజిరేటర్లు, మైక్రోటోమ్, బాటిల్ కూలర్స్, ఐరన్ రాక్స్, టిష్యూ, ప్రొసెసర్ టిష్యూ ట్రైనర్ పరికరాలను మంగళవారం పశు సంవర్ధక శాఖ, విజయవాడ కార్యాలయంలో బహిరంగ వేలం వేయబడునని ఈ వేలంలో పాల్గొనే పాటదారులు ముందుగా రూ. 5 వేల రూపాయలు ధరావతుగా చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. వేలం పాట పాడిన వారు మొత్తం సొమ్మును చెల్లించిన వెంటనే పరికరాలు స్వాధీనం చేయడం జరుగుతుందన్నారు. ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆసక్తి ఉన్నవారు మొబైల్ నెంబర్ 98668 97408 కు సంప్రదించి పూర్తి వివరాలు పొందవచ్చునని సహాయ సంచాలకులు ఆ ప్రకటన లో తెలిపారు.

అమరావతినే రాజధానిగా కొనసాగించాలి

విశాలాంధ్ర-తాడికొండ : అమరావ తినే రాజధానిగా కొనసాగించాలని సీపీఐ, సీపీఎం, టీడీపీ నాయ కులు కోరారు. మండల కేంద్రమైన తాడికొండ అమరావతి దీక్ష శిబిరం వద్ద నాలుగు సంవ త్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ విధానాలను తప్పుపడుతూ ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ 1461 రోజులుగా అమరావతి రైతులు వివిధ రూపాలలో ఆందోళనలు కొన సాగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు, సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు బండ్ల కోటేశ్వరరావు, బి.హరిబాబు, ధూళిపాళ్ల యేసు బాబు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలే సమస్యలకు పరిష్కారం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాలు ఉన్నాయని, ఇంతవరకు ఏ సమస్య పరిష్కరింపబడలేదని, ఐక్య ఉద్యమాలు ద్వారానే సమస్యల పరిష్కారం అవుతాయని ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ పశ్చిమ కృష్ణా శాఖ జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ తెలిపారు.ఆదివారం గాంధీనగర్ లోని ఎన్జీవో హెూం లో జరిగిన ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో సంఘ కార్యవర్గ సమావేశం లో జిల్లా అన్ని మండలాల నుంచి వచ్చిన కార్యవర్గ సభ్యులు ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్స్ కు సంబంధించిన పిఆర్‌సి బకాయిలు, డిఎ బకాయిలు , నూతన వేతన సవరణ,ఐఆర్ మంజూరు వంటి అంశాలు కొన్ని సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోలేదని, రాష్ట్ర ప్రభుత్వం దఫ దఫాలుగా గడువు విధించినప్పటికీ, చిట్టి చివరిగా 30 సెప్టెంబర్ లోపు సమస్యలన్నీ పరిష్కరిస్తామని క్యాబినెట్ సభ కమిటీలో ప్రకటించినప్పటికీ ఇంతవరకు ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని, సమస్యలు పరిష్కారం కానిపక్షంలో వీటన్నిటినీ రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లి ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కరించు కొగలమన్నారు. జిల్లా కార్యదర్శి ఎం డి ఇక్బాల్ మాట్లాడుతూ హెల్త్ కార్డుల అంశంలో ఉద్యోగుల కంట్రిబ్యూషన్ మూడు రెట్లు పెంచినప్పటికీ వైద్య సేవలు సరిగా అందటం లేదని తెలిపారు. సంఘ పత్రిక అయిన ఎన్జీవో సమాచారానికి చందాదారులగా ప్రతి ఒక్క ఉద్యోగిని జాయిన్ చేయాలని పిలుపునిచ్చారు.సమావేశం ప్రారంభానికి ముందు నిన్న రోడ్డు ప్రమాదంలో మరణించిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ, మాజీ జెఏసి నాయకుడు అయిన షేక్ సాబ్జీ మృతికి సంతాపం పాటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. షేక్ సాబ్జి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఉద్యమంలో మరువలేని పాత్ర పోషించారని, ఉపాధ్యాయ లోకానికి ఇది తీరనిలోటని సమావేశం అభిప్రాయపడింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తానన్న ప్రభుత్వం, ఇంతవరకు కాంట్రిబ్యూషన్ రద్దు చేయకపోగా, ఉద్యోగులు కడుతున్న కంట్రిబ్యూషన్ను కూడా సరిగా జమ చేయడం లేదని, ఏది ఏమైనప్పటికీ సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ పునరుద్ధరించాలని కోరారు.మాట మీద నిలబడి సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్ పునరుద్ధరణకు అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం నిర్ణయానికి సమావేశం హర్షం వ్యక్తం చేసింది.కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకై ఉద్యోగులకు గైడ్లైన్స్ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది.అంగన్వాడి, ఆశా వర్కర్ల సమస్యలను కూడా ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కారం చేయాలని సమావేశం నిర్ణయించింది. అంగన్వాడీ ఉద్యోగుల విధుల్లోకి, సచివాలయ సిబ్బందిని ఉపయోగించటం సరికాదని, సామరస్య పూర్వకమైన వాతావరణంలో సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు.జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా ఎన్జీవో నాయకులు ఎం.రాజబాబు, బీవీ రమణ, నాగేంద్ర రావు శ్రీమతి కె శివ లీల, గోపాలకృష్ణమూర్తి, డి.విశ్వనాథ్ మరియు విజయవాడ నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు సి హెచ్ కె .సంపత్ కుమార్,వివిధ తాలూకా యూనిట్ వివిధ శాఖల ఉద్యోగ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శనీయం చంద్ర రాజకుమారి జీవితం

మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): చంద్ర రాజకుమారి జీవితమని ఆదర్శనీయమని మహిళా సమైఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర సమితి ఆధ్వర్యంలో (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) విజయవాడ కొత్తపేటలోని లెనిన్‌భవన్‌లో చంద్ర రాజకుమారి 5వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కుల సాధన, ఆర్థిక స్వావలంబన కోసం అవిశ్రాంతంగా పోరాడిన రాజకుమారి ఉద్యమనేత అని కొనియాడారు. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం మంగళాపురం గ్రామంలో 1940 జనవరి 5న చంద్ర రాజకుమారి జన్మించారన్నారు. చిన్ననాటి నుండే ఆదర్శ భావాలు కలిగి సుమారు 40 ఏళ్లపాటు సీపీఐ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని తెలిపారు. 11 ఏళ్ల పాటు ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసి, సారా వ్యతిరేక, మద్య నిషేధ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. వీరి మరణం మహిళా ఉద్యమానికి, పార్టీకి తీరనిలోటన్నారు. వీరి ఆశయాలకు అనుగుణంగా అందరం అంకిత భావంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నగర అధ్యక్షులు ఒర్సు భారతి, మాజీ కార్పొరేటర్లు తమ్మినా దుర్గ, ఈజ్జడ లక్ష్మి, నగర నాయకులు డి సితరావమ్మ, అండమాని నాగమణి, చింతాడ పార్వతి, నక్కా రాజ్యలక్ష్మీ, బంకా ఝాన్సి లక్ష్మీ, ఎన్ భాగ్యలక్ష్మీ, ఆర్ ఉమా, జి రహెలమ్మ, కొట్టు విజయలక్ష్మి, అనసూయ, మనికుమారి, సింహాచలం, పద్మ, ఈ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో వచ్చి ఫోన్ లాక్కు వెళ్లారు

- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
- ఆటో నంబర్ ఆధారంగా దొంగలు గుర్తింపు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): దర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తుడి ఫోన్ గుర్తుతెలియని దుండగులు లాక్కు వెళ్లారు. ఈఘటన విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. విజయనగరం జిల్లాకు చెందిన ఓ వక్తి దర్గమ్మ దర్శనానికి నగరానికి వచ్చాడు. రైల్వే స్టేషన్ సమీపంలోని ఆర్పీఎఫ్ పోలీస్ స్టేషన్ నుంచి నడుచుకుంటూ వెళ్తున్న సమయలస్త్రంఓ ఓ ఆటోలో వచ్చిన ఇద్దరు దండగులు ఫోన్ లాక్కు వెళ్లారు. బాధితుడు ఇచ్చిన సమాచారంతో వెంటనే పోలీసులు ఆటో నంబర్ ఆధారంగా దొంగలను గుర్తించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘంటసాల గళం తెలుగుజాతికి వరం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : గాయకుడిగా, సంగీత దర్శకుడిగా చలనచిత్రసీమను సుసంపన్నం చేసిన ఘంటసాల గళం తెలుగు జాతికి వరం అని అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు అన్నారు. శ్రీ ఘంటసాల కళా సమితి, శ్రీ లలిత కళా ప్రవంతి, ఎక్సరే సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై జరిగిన ఘంటసాల వేంకటేశ్వర రావు 101వ జయంతి సభా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పాట ఏదైనప్పటికీ ఘంటసాల గళంలో ప్రాణం పోసుకుంటుందని అన్నారు. కవులు, కళాకారులు దేశ సంస్కృతికి ప్రతిరూపాలని అన్నారు. ఆయన గానం అజరామరమని అన్నారు. తెలుగుజాతి గర్వించదగిన గాయకుడని అన్నారు. అదే వేదికపై ఘంటసాల పురస్కారాలను శ్రీహరి, జ్యోతిలకు ప్రదానం చేశారు. రంజింప చేసిన చిత్ర గీతాలాపన..... అదే వేదికపై గాయనీ గాయకులు జ్యోతి, పద్మజ, హరికృష్ణ తదితరులు పలు చిత్రాలలోని పాటలను శ్రోతలను రంజింప చేస్తూ పాడి వినిపించారు. కార్యక్రమంలో కొప్పరపు వెంకట బలరామకృష్ణమూర్తి, శర్మ, పద్మావతి, కొల్లూరి, బోడి ఆంజనేయరాజు, ఎ అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఎంపీ సీటు బీసీలకు కేటాయించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రానున్న ఎన్నికల్లో విజయవాడ పార్లమెంటు సీటును ఈ సారి బీసీలకు కేటాయించి అన్ని రాజకీయపార్టీలు బీసీలపై తమ నిజాయితీని నిరుపించుకొవాలని పలువరు బీసీ నాయకులు డిమాండ్ చేశారు.అదివారం ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో హెూటల్ ఐలాపురం కన్వెన్షన్ సెంటర్లో బీసీ మేధావుల సమావేశం నిర్వహించారు. దీనికి ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ మారేష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ విజయవాడ పార్లమెంటు పరిధిలోని 7 నియోజక వర్గాలలో 16 లక్షల జనాభా ఉంటే దానిలో 8 లక్షల పైగా మైనార్టీలతో కలుపుకొని బీసీలు ఉన్నారు ఎస్సీ, ఎస్టీ సోదరులు 4 లక్షలు,కాపు సోదరులు రెండు లక్షలు ఉన్నారు మొత్తం జనాభాగా 14 లక్షలు కలిగి ఉన్నారని కేవలం ఒకే సామాజిక వర్గం చేతిలో దాదాపు 70 సంవత్సరాలు పైగా విజయవాడ ఎంపీ సీటు ఉండడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రధాన పార్టీల అధ్యక్షులకు వైయస్ జగన్మోహన్ రెడ్డి,ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిజెపి పార్టీ అధ్యక్షులు జనసేన పార్టీ అధ్యక్షులుకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం తరఫున విజయవాడ పార్లమెంటు చరిత్రను పరిశీలించి బీసీలకు విజయవాడ ఎంపీ సీటు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. 1952 నుండి 2019 వరకు 17 సార్లు పార్లమెంటుకు ఎన్నికలు జరిగితే ఒక్కసారి కూడా బీసీకి అవకాశం రాకపోవడం దురదృష్టకరం,ఇప్పటికే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు కాపు సోదరులు మద్దతు కూడగట్టామని రాబోయే రోజుల్లో విస్తృత స్థాయిలో బీసీ సమావేశాలు ఏర్పాటు చేయబోతున్నామన్నారు.నూటికి నూరు శాతం బెజవాడ గడ్డ బీసీల అడ్డా అని వచ్చే ఎన్నికల్లో నిరూపించబోతున్నామన్నారు.బీసీలను ఓట్లు వేసే యంత్రాలు లాగా చూడకుండా రాజ్యాధికారంలో వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టి.అర్జున్ రావు,వేముల బేబీ రాణి,ఈతాకులు జగదీష్,మోర్ల మహిధర్,బెజవాడ గణేష్,జక్కా శ్రీనివాసరావు,పంతగాని రమేష్,శివ,వేములకొండ సుబ్బారావు,కోమటి కోటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR (DIST REGISTRAR) AT VIJAYAWADA
ARBITRATION/CLAIM PETITION No. 36/ 2023
BETWEEN:
M/s. Shriram Chits (India) Pvt Ltd., Eluru Road Branch, Vijayawada.
Rep by its: Legal Manager and G.P.A. Holder, Vijayawada. **- DISPUTANT**
VERSUS
V.Kishore & 3 others - OPPONENTS
OPP-2: Vuyyuru Sravan Kumar, S/o Chandrasekhar, Hindu, Male, Aged about 35 Years, Occupation: Employee, Designation: Secondary Grade Teacher, Emp Code:1640977, M.P.P. School, Penuballi (MD), Residence of D.No:7-13, Kothakaraigudem, Penuballi(MD), Khammam, 507302.
Please take Notice that the above arbitration is filed by the Disputant for recovery of **Rs. 25,108-00/-** Subsequent interest, costs, etc stands posted to **22-12- 2023** for your appearance in Case of your failure to appear before the Hon'ble Court at **10-00 A.M.** on either in person or though Advocate, the matter will be decided Exparty.
(By Order of the Court)
Shriram Chits (India) Pvt Ltd
Eluru Road Branch, Vijayawada.
For: DISPUTANT

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR (DIST REGISTRAR) AT VIJAYAWADA
ARBITRATION/CLAIM PETITION No. 39/ 2023
BETWEEN:
M/s. Shriram Chits (India) Pvt Ltd., Eluru Road Branch, Vijayawada.
Rep by its: Legal Manager and G.P.A. Holder, Vijayawada. **- DISPUTANT**
VERSUS
G. Gayatri & 3 others - OPPONENTS
OPP-2: Nagasuri Narasimha Murthy, S/o Koteshwara Rao, Hindu, Male, Aged about 37 Years, Occupation: Business. Residence of D.No: 42-21-6, Block No: 62, Dobakottu Road, Ajith Singh Nagar, Vijayawada.
OPP-4: Gadhamsetty Ravi Chandra Kumar, S/o Narasimha Rao, Hindu, Male, Aged about 47 Years, Occupation: Business. Residence of D.No:42-87-19/1, Block No:2, Opp Venkateswara Temple Lane, Old Singh Nagar, Vijayawada.
Please take Notice that the above arbitration is filed by the Disputant for recovery of **Rs. 17,51,757-00/-** Subsequent interest, costs, etc stands posted to **22-12- 2023** for your appearance in Case of your failure to appear before the Hon'ble Court at **10-00 A.M.** on either in person or though Advocate, the matter will be decided Exparty.
(By Order of the Court)
Shriram Chits (India) Pvt Ltd
Eluru Road Branch, Vijayawada.
For: DISPUTANT

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR (DIST REGISTRAR) AT VIJAYAWADA
ARBITRATION/CLAIM PETITION No. 275/ 2022
BETWEEN:
M/s. Shriram Chits (India) Pvt Ltd., Patamata Branch, Vijayawada.
Rep by its: Legal Manager and G.P.A. Holder, Vijayawada. **- DISPUTANT**
VERSUS
Yenumula Kotireddy & 3 others - OPPONENTS
OPP-1: Yenumula Kotireddy, , S/o Venkata Reddy, Hindu, Male, Aged about 37 years, Occupation : Business, Car Rentals Own Services, Vijayawada. Residence D.No: 76-17-613, Urmila Subba Rao Nagar, Bhavanipuram, Kamakotinagar, Vijayawada.
OPP-3: P. Srinivas Rao, S/o. Simhachalam, Hindu, male, Aged about 34 Years, Occupation: Business. Residence of D.No:3-1-273/9, Rotary Nagar, Kabela Center, Vijayawada.
Please take Notice that the above arbitration is filed by the Disputant for recovery of **Rs. 10,75,500-00/-** Subsequent interest, costs, etc stands posted to **22-12- 2023** for your appearance in Case of your failure to appear before the Hon'ble Court at **10-00 A.M.** on either in person or though Advocate, the matter will be decided Exparty.
(By Order of the Court)
Shriram Chits (India) Pvt Ltd
Patamata Branch, Vijayawada.
For: DISPUTANT

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR (DIST REGISTRAR) AT VIJAYAWADA
ARBITRATION/CLAIM PETITION No. 278/ 2022
BETWEEN:
M/s. Shriram Chits (India) Pvt Ltd., Patamata Branch, Vijayawada.
Rep by its: Legal Manager and G.P.A. Holder, Vijayawada. **- DISPUTANT**
VERSUS
K. Anjaneyulu & 2 others - OPPONENTS
OPP-1: K.Anjaneyulu, S/o Lakshmaiah, Hindu, male, Aged about 39 Years. Occupation: Employee, Designation: C.R.P., M.E.O. Movva Mandal. Residence of D.No:5-173-1, Ayyanki, Movva Mandal, Krishna Dist, 521138.
OPP-2: K.Rama Krishna, S/o Achheswara Rao, Hindu, Male, Aged about 32 Years. Occupation: Employee, Designation: Attender, Emp Code: 0566901, A.P. Revenue Department. Residence of D.No: 5-42/3, Ayyanki, Movva Mandal, Krishna Dist.
OPP-3: CH.V.Srinivas, S/o. Tata Rao, Hindu, male, Aged about 38 Years, Occupation: Private Employee, Residence of D.No:8-3-168/H/37, Bhavani Nagar, Gokul Cinema Hall, Erragadda, Hyderabad, 500018.
Please take Notice that the above arbitration is filed by the Disputant for recovery of **Rs. 1,44,675-00/-** Subsequent interest, costs, etc stands posted to **22-12- 2023** for your appearance in Case of your failure to appear before the Hon'ble Court at **10-00 A.M.** on either in person or though Advocate, the matter will be decided Exparty.
(By Order of the Court)
Shriram Chits (India) Pvt Ltd
Patamata Branch, Vijayawada.
For: DISPUTANT

ప్రమాదాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : రహదారుల దుస్థితి కారణంగా జరుగుతున్న ప్రమాదాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అన్నారు. మేకావారిపాలెం వద్ద ఆర్టీసీ బస్సు పల్టీకొట్టిన సమాచారం అందుకున్న ఆయన సంఘటనా ప్రదేశానికి వచ్చి ప్రమాద కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ విలేకర్లతో మాట్లాడుతూ, అవనిగడ్డ నియోజకవర్గంలో ప్రవేటు బస్సులు, ఆర్టీసీ బస్సులు, కార్లు ప్రమాదాల బారిన పడుతుండటం ఇటీవల షరా మామూలుగా మారిందన్నారు. రహదారులు బావుంటే ఈ ప్రమాదాలు జరిగే అవకాశం ఉండేదికాదన్నారు.

అధ్వాన్న రహదారులతో ప్రజల ప్రాణాలకు భద్రత లేదనీ, కోడూరు రోడ్డులో ఎన్నో ప్రమాదాలు జరిగిన విషయం గుర్తుచేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీనే అమలుకాని దుస్థితి నెలకొందనీ, నడకుదురు రోడ్డు కొత్తగా వేసిందే అయినా గోతులు ప్రమాదకరంగా మారాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రహదారులను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. రహదారుల దుస్థితి ఎమ్మెల్యేకు పట్టడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, పైడిపాముల కృష్ణకుమారి, రావి చిట్టి, మోర్ల శివ, షేక్ నబీఘోరి తదితరులు ఉన్నారు.

మలబార్ డైమండ్ ఫెస్టివల్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : ఎం.జి.రోడ్డులోని మలబార్ గోల్డ్ అండ్డైమండ్ షోరూమ్ నందు డైమండ్ ఫెస్టివల్ను ప్రారంభించినట్లు మలబార్ గ్రూప్ చైర్మన్ ఎం.పి. అహ్మద్ అన్నారు. ఎం.జి.రోడ్డులోని షోరూమ్ నందు ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న పండుగలు, శుభ కార్యాలు సందర్భంగా అన్ని మలబార్ షోరూమ్లలో డైమండ్ ఫెస్టివల్ను జనవరి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈఫెస్టివల్లో మైన్ డైమండ్ఆభరణాల మార్పిడిపై వినియోగదారులు 100 శాతం విలువను పొందవచ్చని, అలాగే కొనుగోలు చేసిన డైమండ్ విలువపై 25 శాతం తగ్గింపు లభిస్తుందన్నారు. ఈఫెస్టివల్లో సాలిటైర్, పార్టీవేర్, క్యాజువల్, బ్రైడల్ ఆభరణాలు, స్టేట్మెంట్ నెక్లేస్లు, అద్భుతమైన చెవిపోగులు, స్టడీ రింగ్లు, ఎన్నో విభిన్నమైన ఆభరణాలు ఉన్నాయని తెలిపారు. అత్యున్నత నాణ్యత గల ఆభరణాలను అందిస్తున్నామని, 28 పాయింట్ల నాణ్యత గల తనిఖీ నిర్వహించిన తరువాత విక్రయిస్తున్నామన్నారు. ప్రతి ఆభరణం యొక్క నాణ్యత, స్వచ్ఛత కలిగిఉంటుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలను నిర్ధారిస్తూ జీఐఏ, ఐజీఐ ధృవపత్రాలను పొదవచ్చని తెలిపారు. అన్ని ఆభరణాలపై ఏడాది పాటు ఉచిత బీమా, బై బ్యాక్ హామీ వంటి విలువ ఆధారిత సేవలందిస్తున్నామని పేర్కొన్నారు.

నగరంలో 'బబుల్గమ్' చిత్ర యూనిట్ సందడి

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీ పేట : నగరంలో బబుల్ గమ్ చిత్ర యూనిట్ సందడి చేసింది . ఈనెల 29వ తేదీన సినిమా విడుదల నేపథ్యంలో ప్రమోషన్ లో భాగంగా బందర్ రోడ్ లోని హెూటల్ మురళి ఫార్చ్యూన్ లో చిత్ర యూనిట్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. సమావేశంలో హీరో రోషన్ మాట్లాడుతూ బబుల్ గమ్ చిత్రం బ్యూటీఫుల్ లవ్ ఎంటర్టైన్మెంట్ చిత్రమని డైరెక్టర్ రవికాంత్ పేరేపు ఈ చిత్రాన్ని చాలా చక్కగా తీశారని చెప్పారు. సినిమాలో వచ్చే ప్రేమ కథ సన్నివేశాలు నేటి యువతరానికి దగ్గరగా ఉంటాయని తెలిపారు. విజయవాడ నగరం నుంచి చిత్ర ప్రమోషన్ కార్యక్రమం ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన మొదటి చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు ఆదరించాలని ఆయన కోరారు. ఈ చిత్రంలో నటించిన నటినటులు అందరూ తనకు ఎంతగానో సహకరించారని పేర్కొన్నారు. తన తాత దేవదాస్ కనకాల నుంచి యాక్టింగ్ నేర్చుకున్నానని తన తల్లిదండ్రులు కూడా తనకు ఎంతగానో సహకరించారని చెప్పారు. ఈ చిత్రం టీజర్ ట్రైలర్ కు ఎప్పటికీ విశేష స్పందన లభిస్తోందని, మూడు పాటలు రిలీజ్ అయ్యాయని ఆ మూడు పాటలు ప్రేక్షకాదర న పొందడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ చిత్రం కుటుంబ సమేతంగా చూడవచ్చని ఎటువంటి అసభ్యకరమైన సన్నివేశాలు లేవని స్పష్టం చేశారు. అనంతరం హీరోయిన్ మానస చౌదరి మాట్లాడుతూ తెలుగులో మొట్టమొదటిసారిగా బబుల్ గమ్ చిత్రంలో నటించానని, ఈ చిత్రంలో తన పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని చెప్పారు. ప్రేక్షకులు ఈనెల 29వ తేదీన చిత్రాన్ని వీక్షించి తమను ఆదరించాలని ఆమె కోరారు. విలేకరుల సమావేశంలో నటులు విష్ణు, కిరణ్ మచ్చ, అనన్య ఆహు ల పాల్గొన్నారు

గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్గా పూనావల్లా మార్పు

విశాలాంధ్ర-విజయవాడ: పూనావల్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఇప్పుడు గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (జీహెచ్ఎఫ్ఎల్)గా రీబ్రాండ్ చేయబడిరదని గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మనీష్ జైస్వాల్ తెలిపారు. గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ టీపీజీ ఈ సంవత్సరం ప్రారంభంలో పూనావల్ల ఫిన్కార్ప్ లిమిటెడ్ నుంచి కంపెనీలో 99.02 శాతం ఈక్విటీ వాటాను కొనుగోలు చేసిందన్నారు. పేరు మార్పు కోసం అవసరమైన అన్ని నియంత్రణ ఆమోదాలు వచ్చాయన్నారు. జీహెచ్ఎఫ్ఎల్ ఆరేళ్లలో 28 శాతం సీఏజీఆర్ వృద్ధి చెందిందన్నారు. నిర్వహణలో ఉన్న ఆస్తులలో (ఏయూఎం) రూ. 7,500 కోట్ల మైలురాయిని సాధించిందన్నారు. దీని కస్టమర్ బేస్ 75,000కి పెరిగిందని, 195 శాఖలతో ఉందన్నారు. దాదాపు 85 శాతం మంది కస్టమర్లు మహిళలు (దరఖాస్తుదారులు, సహ-దరఖాస్తుదారులతో) కంపెనీ లింగ సమాన విధానాన్ని అవలంబిస్తుందన్నారు. కంపెనీ నికర విలువ రూ.1,800 కోట్లకు పైగా ఉండటం వల్ల వ్యాపార సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, పరపతిని సమర్థవంతంగా నిర్వహించడానికి ఇది హెడ్రూమ్ను అందిస్తుందని తెలిపారు.

సమగ్ర ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా 'రిలయన్స్ హెల్త్ గ్లోబల్'

విశాలాంధ్ర-విజయవాడ: రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఆర్జీఐసీఎల్) 'రిలయన్స్ హెల్త్ గ్లోబల్' అనే హెల్త్కేర్ పాలసీని ప్రారంభించినట్లు రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ సీఈవో రాకేష్ జైన్ తెలిపారు. భారతీయులకు గ్లోబల్ హెల్త్కేర్ను అందుబాటులోకి తీసుకురావడానికి రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ పాలసీ హెల్త్ అసమానమైన ఫీచర్లను కలిగి ఉందన్నారు. ఆరోగ్య బీమా ఆఫర్ల ల్యాండ్స్కేప్ను పునర్నిర్వచించిందని తెలిపారు. క్యాన్సర్, బైపాస్ సర్జరీ వంటి క్లిష్టమైన అనారోగ్యాలతో సహా విదేశీ చికిత్స కోసం దాని సమగ్ర కవరేజీకి మించి, ఈ పాలసీ దాని అసాధారణమైన దేశీయ కవరేజీకి ప్రత్యేకంగా నిలుస్తుందని తెలిపారు. అపరిమిత మొత్తం బీమాతో ఇది పాలసీదారులకు అసమానమైన భద్రత, మనశ్శాంతిని అందిస్తూ ఆరోగ్య బీమా నమూనాను పునర్నిర్వచిస్తుందని పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధమైన హాస్పిటలైజేషన్తో పాటు ఈ పాలసీ ప్రయాణం, వసతి, ఎండ్-టు-ఎండ్ వీసా, సహాయ సేవలు, లాస్ట్ పాస్పోర్ట్ లేదా ఎమర్జెన్సీ క్యాష్ వంటి అత్యవసర పరిస్థితులను కలిగి ఉంటుందన్నారు.

రాజకీయ కక్షలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు

- నందిగం సురేష్ అనుచరుడు రేపల్లె సన్నీ

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : తాడేపల్లి సీఎం నివాసం సమీపంలో బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అనుచరుడు ఆగడాలు అంటూ గుర్తుతెలియని వ్యక్తులు పోస్టర్లు వేయటంపై బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అనుచరుడు రేపల్లె సన్నీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుడు నందిగం సురేష్ ఇమేజ్ని దెబ్బతీయటనికే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ విషయమై తమ దగ్గర పూర్తి ఆధారాలు ఉన్నాయని దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు తెలిపారు. లబ్బీపేట లోని హెూటల్ వైబ్రాంట్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అనుచరుడు రేపల్లె సన్నీ మాట్లాడారు. బాపట్ల ఎంపీ అనుచరుడినైనా తన పై రాజకీయ కక్షతో బురదజల్లే ప్రయత్నాల్లో భాగంగానే ముజీబు అనే వ్యక్తి పోస్టర్లు వేసాడన్నారు. బాపట్ల ఎంపీ పేరును సైతం వాడి ఆయన ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నాడని చెప్పారు. తనకు సదరు పోస్టర్లు వేసి తన పరువుకు భంగం కలిగిస్తున్న ముజీబు అతని సోదరుడు అనుచరులు కేవలం రాజకీయ కక్షతోనే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారాన్నరు. తనకు సదరు ఆరోపణలు చేసిన ముజీబు అనే వ్యక్తికి ఎటువంటి రాజకీయ లావాదేవీలు జరగలేదని స్పష్టం చేశారు. ఎంపీ గన్మెన్ గా పనిచేసిన ఖాన్ అనే వ్యక్తి ద్వారా తనకు ముజీబ్ పరిచయమనీ, చిన్నచిన్న పనుల నిమిత్తం తమ వద్దకు వచ్చేవాడన్నారు. అంతేగాని సదరు ఆరోపిస్తున్న వ్యక్తికి తనకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుల ప్రోత్బలంతో ముజీబు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని దీనివల్ల తన వ్యక్తిగత పరువు దెబ్బతింటున్నదన్నరు. అందువల్లనే త్వరలో న్యాయస్థానంలో ముజీబుపై పరువు నష్టం దావా కేసు వేయనున్నట్లు పేర్కొన్నారు.. కేవలం తమ నాయకుడు నందిగం సురేష్ ఇమేజ్ని దెబ్బతీయటనికే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తమ దగ్గర ఆధారాలు ఉన్నాయని దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించను నట్లు తెలియజేశారు.

సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక : ప్రసాద్

విశాలాంధ్ర-గుడివాడ : వనసమారాధనలతో సంస్కృతి సాంప్రదాయాలకు ఐక్యమత్యంగా ఉండడానికి తోడ్పడతాయని ప॥గో జిల్లా జడ్పి చైర్మన్ ఘంట పద్మశ్రీప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో వెలమ యువత ఆధ్వర్యంలో వెలమ సంఘీయుల కార్తీక వనసమారాధన ఘనంగా జరిగింది. తొలుత ఊసిరి చెట్టుకు పూజ చేసి సమారాధనను ప్రారంభించారు. అనంతరం మహిళలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనతరం జడ్పి చైర్మన్ పద్మశ్రీప్రసాద్, పద్మ దంపతులు మార్కెట్యార్డు వైస్ చైర్మన్ చింతల భాస్కరరావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు డా॥గోర్జి సత్యనారాయణ, వెలమ యువత రెడ్డి షణ్ముఖ, డొంక రవితేజ, నాగిరెడ్డి మోహన్, గంట అజయ్, గొర్రెల నరేంద్ర, బంకురి జగన్, సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : దివిసీమలో ధనుర్మాస పూజలు వైష్ణావాలయాల్లో ఆదివారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. వైష్ణావాలయ అర్చకులు ఈ సందర్భంగా ధనుర్మాస ఉత్సవ ప్రత్యేకతను వివరించారు.. ఈ మాసం మహా విష్ణువుకి అత్యంత ప్రీతికరమైన మాసమని ధనుర్మాసమంతా విష్ణుపారాయణాలతో దేవాలయాలు మారుమ్రోగుతాయని మార్గశిర మాసంలోనే ధనుర్మాసం జరుగుతుందన్నారు. మాసాల్లో మార్గశిరాన్ని నేనే అని విష్ణుమూర్తి స్వయంగా చెప్పుకున్నారంటే ఈ మాసానికి ఉన్న విశిష్టత అర్థం అవుతుందని, మార్గశిరం విశిష్టత మార్గశిరం అంటే మార్గాలలో శ్రేష్టమైనది అని అర్థం. మార్గంలో సాధనం అనగా ఉపాయాల్లో గొప్పది. మార్గం అనగా కర్మయోగం, భక్తి యోగం, జ్ఞాన యోగం, కార్తికేయుడు, ఖాలభైరవుడు, దత్తత్రేయుడితో పాటు భగవత్ గీత అవతరించింది కూడా ఈ మాసమే కావడం విశేషం. మార్గశిర మాసం శ్రీ కృష్ణ తత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ మాసంలో లక్ష్మీదేవిని నారాయుడిని తులసితో పూజిస్తే సకల సంపదలు కలుగుతాయని, శాస్త్రాలు చెబుతున్నాయన్నారు. ధనుర్మాస విశిష్టత మార్గశిర మాసంలో ధనురాశిలోకి సూర్యుడు ప్రవేశించి మకరరాశిలో జరిగే కాలాన్ని ధనుర్మాసం అంటారు. విష్ణువుకు ప్రీతిపాత్రమైన ధనుర్మాస ఉత్సవాన్ని వైష్ణవులు ఎంతో పవిత్ర మాసంగా భావిస్తున్నారు. డిసెంబర్ 17 వ తేది నుండి జనవరి 14 వ తేది గోదాదేవి కళ్యాణంతో ముగుస్తుందన్నారు. ధనుర్మాసం మొత్తం ఆధ్యాత్మికతతో ముడిపడి ఉంటుందని, తెలుగు సంస్కృతిలో ధనుర్మాసం ఒక భాగం అని, నెల పాటు వైష్ణవ ఆలయాల్లో విశిష్ట పూజలు నిర్వహించి తిరుప్పావై పఠనం, గోదాకళ్యాణం, అండాలమ్మ పూజలు నిర్వహిస్తారన్నారు. ఈ 30 రోజులు తిరుమలలో వెంకటేశ్వర స్వామి వారికి సుప్రభాతం బదులుగా తిరుప్పావై పఠిస్తారంటే ఈ మాసానికి ఎంత పవిత్ర ఉందో తెలుసుకోవచ్చన్నారు. జరిగే ఆగమ శాస్త్ర కైంకరయాలలో ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు కలిసిన అంశాల్లో ధనుర్మాసం ఒకటని, ఈ మాసంలో ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహంతో పాటు దరిద్రం దూరమవుతుందని భక్తుల నమ్మకం. గోధా దేవి ఆవిర్భావం రోజుకి ఒక పాశురం చొప్పున 30 రోజులు 30 పాశురాలు పాడి గోధా దేవి ఆ రంగనాధునిలో ఐక్యమైపోయింది. ఉత్తర ద్వార దర్శన భాగ్యం పరమపవిత్రమైన ధనుర్మాసంలో ప్రత్యేకమైన రోజు ముక్కోటి ఏకాదశి. ఈ రోజునే అన్ని వైష్ణావాలాయాల్లో ఉత్తర ధ్వార దర్శనం ఉంటుంది. ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న వారికి పునర్జన్మ ఉండదని పురానాలు చెబుతున్నాయి. ఈ మాసంలో నెల రోజుల పాటు బ్రహ్మ ముహుర్తంలో పారాయణం చేసిన వారు దైవానుగ్రహానికి పాత్రులగుట తధ్యం అని, శాస్త్ర ప్రవచనం తెలుపుతుందన్నారు.

సెమ్మీ క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-గుడివాడ : రూరల్ మండలంలోని వలివర్తిపాడులోని వైసిపి నాయకులు కలపాల కిరణ్ అధ్యర్యంలో శనివారం రాత్రి సెమ్మీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వలివర్తిపాడు గూడెం క్రిస్టియన్ యూత్చే 10వ వార్షికోత్సవ సెమ్మీ క్రిస్టమస్ వేడుకలను వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శీను, వల్లూరిపల్లి సుధాకర్, రూరల్ మండల అధ్యక్షుడు మట్ట జాన్విక్టర్లతో కలసి కిరణ్ క్రిసమస్ కేక్ను కట్ చేశారు. అనతరం దుస్తులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నందూరి శేఖర్, రమేష్, చక్రవర్తి, కలపాల సుమంత్, స్వరూప్ ,రాము, ప్రేమ్ సాగర్ ,ప్రశాంత్ ,అఖిల్, సాత్విక్,తదితరులు పాల్గొన్నారు.

శాంతి కళ్యాణం

విశాలాంధ్ర-అవనిగడ్డ : స్వామి వారి శాంతి కళ్యాణాన్ని నేత్రానందంగా నిర్వహించారు. మండల పరిధిలోని పులిగడ్డ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం స్వామి వారి శాంతి కళ్యాణం వేదమంత్రోచ్ఛారణల నడుమ భక్తుల నేత్రానందంగా శాంతి కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారి శాంతి కళ్యాణం తిలకించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు భక్తులకు కావలసిన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.

ఆరోగ్య పరిస్థితులపై ఆరా

విశాలాంధ్ర-అవనిగడ్డ : జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు ఆరోగ్య పరిస్థితిపై శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని నెలలుగా వైద్యశాలలో చికిత్స పొంది ఇటీవల ఇంటికి రావడంతో ఆదివారం శ్యామ్ కిషోర్ నాయుడు రాయపూడి ఇంటికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని మరి కొంత కాలం బెడ్రెస్ట్ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాయపూడిని పరామర్శించినందుకు శ్యామ్ కిషోర్ నాయుడుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. శ్యామ్ కిషోర్ తో పాటు రేమాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కళ్లజోళ్లు పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : నందివాడ మండలం తమిరిశ గ్రామంలోని ఉమా స్పిన్ టెక్స్ ప్రాంగణంలో పిన్నమనేని కోటేశ్వరరావు ఎడ్యుకేషన్, మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఐ క్యాంపులో నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన వారికి ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జి)లు కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాన్ని గుర్తించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 7వందల మంది పాల్గొని నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. వారిలో అవసరమైన 5వందల మందికి నేడు కళ్ళజోళ్ళు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ పిన్నమనేని శ్రీరామకృష్ణప్రసాద్, నేత్ర వైద్యులు డాక్టర్ షరీఫ్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రామ మందిరం అయోధ్య నుండి అక్షింతలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఈ నెల 22 వ తేది నుండి మండలంలోని అన్నీ గ్రామాలకు భవ్య సుందర రామ మందిరం అయోధ్య నుండి పూజ చేసి వచ్చిన అక్షింతలను ఇంటింటికి పంపనున్నట్లు విశ్వ హిందు పరిషత్ అధ్యక్షులు మరియు కార్యక్రమ అభియాన్ ప్రముఖ్ కమ్మిలి సుబ్రహ్మణేశ్వరరావు చెప్పారు. ఆదివారం సాయంత్రం పురాతన దేవాలయంగా ఉన్న లక్ష్మీనారాయణ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో గల గీతామందిరం నందు ఆయోధ్య భవ్య సీతారామ మందిరం నుండి వచ్చి ఉన్న సీతారాముల వారి అక్షింతలు ప్రతి హిందు గృహాలకు చేర్చేందుకు ప్రత్యేక పూజలు నిర్వహించి సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకున్నారు. ఆర్.ఎస్.ఎస్ అనుభంద వివిధ క్షేత్రాలనుండి వచ్చు హిందు బంధువులతో జరిగిన అయోధ్య నుండి వచ్చిన అక్షింతలు 22 వ తేది శుక్రవారం రోజున ఈ ప్రాంగణంలో ఉన్న శ్రీ కృష్ణ మందిరానికి వచ్చి స్వామి వారి అక్షింతలు తీసుకుని వారి గ్రామాల్లోని దేవాలయాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి జనవరి 1 వ తేది నుండి 10 వ తేది వరకు ప్రతి హిందు గృహానికి అక్షింతలు చేర్చాల్సిందిగా ప్రాంత సహకారదర్శి తూర్పు విభాగం భూపతిరాజు, సుబ్బరాజు చెప్పారు. కృష్ణాజిల్లా హిందు పరిషత్ ఉపాధ్యక్షులు లింగం బసవ శంకరరావు, మండల ధర్మాచార్య సంపర్గ్ ప్రముఖ్ టిటిడి మండల ధర్మాచార్యులు అన్నపరెడ్డి కృష్ణ, హిందు బంధువులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రోడ్డు పాలవుతున్న తాగునీరు

విశాలాంధ్ర-అవనిగడ్డ : తాగునీటి పైప్లైన్కు కాలం చెల్లి త్రాగునీరు రోడ్డు పాలవుతుంది. అవనిగడ్డ 2 వ వార్డులోని బిసి కాలని సమీపంలో కాలువ గట్టుపైన వేసిన బోరు నుండి సీతాయలంక, మండలీపురం, సింహాద్రి కాలనీలకు పంచాయితీ వారు త్రాగునీటిని సరఫరా చేస్తున్నారు. సీతాయలంక వద్ద గల కాలి బాట వంతెనపై ఐరన్ మంచినీటి పైపులను ఏర్పాటు చేయడంతో వాటికి కాలం చెల్లి తుప్పు పట్టి త్రాగు నీరు వృధాగా పోతుంది. ఈ త్రాగు నీరు వృధాగా పోవడంతో సింహాద్రి కాలనీ, మండలీపురం వాసులకు ఆదివారం త్రాగునీటి కష్టాలు ప్రారంభం అయ్యాయి. సంబంధిత అధికారులు కాలం చెల్లిన పైపులను తొలగించి నూతన పైప్లను వేసి మంచి నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆ యా కాలనీల వాసులు కోరుతున్నారు.

ఉత్సవాలకు పైడమ్మ ఆలయం ముస్తాబు

విశాలాంధ్ర-పెడన : గ్రామ దేవత అయిన పైడమ్మ అమ్మవారి ఆలయం ఉత్సవాలకు ముస్తాబు అవుతోంది. ఈనెల 26వ తేదీ నుండి జనవరి 5వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు కమిటీ సభ్యులు ప్రకటించారు. 11 రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న భక్తులు లక్షలాది సంఖ్యలో పాల్గొంటారు. ఈ ఉత్సవాల్లో అమ్మవారికి భక్తులు ధూప దీప నైవేద్యాలతో పాటు సిడి బండ్లు కడతారు. అంతేకాకుండా కోళ్లు, మేకలు, గొర్రెలను ఆలయం చుట్టూ తిప్పి మొక్కుబడులు చెల్లిస్తారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో ఉన్న అమ్మవారి స్థలాల్లో ఎగ్జిబిషన్లు, పూజ సామాన్లు తినుబండారాల షాపులను నిర్మిస్తున్నారు. 11 రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాల్లో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు భక్తులకు ఉచిత దర్శనం తో పాటు ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. అంతేకాకుండా జనవరి 12వ తేదీ శుక్రవారం దాదాపు లక్షన్నర మందికి పైగా అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు పేర్కొన్నారు ప్రతి ఏడాది లాగానే ఈసారి కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో తిక్కిశెట్టి వీర వెంకట మోహన్ రావు పేర్కొన్నారు.ఇప్పటికే మున్సిపల్ అధికారులకు, వైద్య విధాన పరిషత్, పోలీసులతోపాటు, పలు శాఖల అధికారులకు కూడా సమిష్టిగా కృషి చేసి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని కోరామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, ఫలహారాలు ఏర్పాటు చేస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు సలహాలు సూచనలు తీసుకుంటున్నామన్నారు.

రహదారులు అభివృద్ధి చేయాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : ప్రమాదాలను నివారించేందుకు అధ్వాన్న రహదారులను అభివృద్ధి చేయాలని జనసేన నేత రాయపూడి వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సులు తరచూ ప్రమాదాలకు గురికావటం, రహదారులను చూసి డ్రైవర్లు భయపడే పరిస్థితి నెలకొందన్నారు. రహదారుల దుస్థితి చూస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బస్సులు నడుపుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలనీ, రహదారులను బాగుచేయించాలనీ, ఆర్టీసీ అధికారులు సైతం బస్సులు కండీషన్లో ఉండేలా చూడాలని కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-విజయవాడ (వన్టౌన్): విజయవాడ వాంబేకాలనీలోని మాతృ దేవో భవ వృద్ధాశ్రమంలో ఆదివారం వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. మానవ సేవే మాధవ సేవ లో భాగంగా వృద్ధాశ్రమం లోని వృద్ధులకు జయ కృష్ణా సాయి పుట్టిన రోజు సందర్భంగా దాత ఏ,ఎల్,కుమార్ దాతృత్వం లో డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భముగా దాతలకు సొసైటీ కార్యదర్శి ధన్యవాదములు తెలిపారు .అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్ సేవా కార్యక్రమాలు కు సహకరించాలని దాతలకు పిలుపు నిచ్చారు,ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కొండా య గుంట రాము, కోశాధికారి గుర్రం ఏడు కొండలు,పొలవరాపు రాజారావు,దుర్గా, జ్ఞానేంద్ర తదితరులు పాల్గొన్నారు.